# శిక్ష

"మీకసలు బుద్ధి లేదు." పెళ్ళయేక ఈ పాతికేళ్ళలోనూ జగదాంబ భర్త గురించి తనకున్న అభిప్రాయాన్ని ఎన్ని వేల సార్లు స్పష్టం చేసిందో!

భీమశంకరం ఎప్పటిలాగే మారు మాట్లాడ లేదు. భార్య టిఫిన్ ప్లేటు తెచ్చి, టీపాయ్ మీద చప్పుడు చేస్తూ పెట్టింది. రాత్రి నుంచి ఆ ఇంట్లో వొక విచిత్రమైన విషయం గురించి చర్చ జరుగుతోంది. సునందవల్లి ఏదో పుస్తకం చేత్తో పట్టుకుని కూర్చుని ఉంది. కళ్ళు పుస్తకంలోని పేజీలమీదే వున్నా, ఆమె తల్లి దండ్రుల ఆందోళన గమనిస్తూనే ఉంది.

తల్లి దొరికిన అవకాశాన్ని వదులు కోకుండా తండ్రిని దులపరిస్తూనే ఉంది. తండ్రి పది మాటలకో మాటగా ఉండుండి జవాబులిస్తున్నాడు.

'తలెత్తుకుని రేపు ఆఫీసుకెలా పోవడం?' భీమశంకరానికేమీ పాలు పోవడం లేదు.

"ఏమొచ్చిందటా? ఆఫీసుకి తలెత్తుకుని వెళ్ళలేకపోవడానికి మీవల్ల ఏం ఘోరం యిప్పుడు జరిగి పోయిందనీ?... ఆవిడేదో అవాకులూ చవాకులూ వాగి ఉంటే, ఆ నిందా రొష్టూ ఆవిడవి... మీకేంమధ్యన..." జగదాంబ భర్త ముందునుంచి టిఫిన్ ప్లేటు తీసెయ్యబోతూ ఆగిపోయింది. పెట్టిన ఇడ్లీలు అలాగే ఉండిపోయేయి. ఒకటో అరో ముక్క కొరికి వదిలేసాడు. టిఫిన్ మింగుడు పడినట్టు లేదు.

"అలా వదిలేసారేం..." భర్తని నిలదీసింది జగదాంబ. "సయించ లేదే" "అయ్యో, రామ! ఇది మరీ బాగుంది. ఉరి తాడు సరదాగా పీకకి బిగించు కోవడం... ఆ తర్వాత ఊపిరాడక విల విలలాడి పోవడం... ఇలా ఉంది మీ వరస... చాదస్తాలు ఓడకండి... ఇప్పుడేం జరిగి పోలేదు. ఆ రెండిడ్లీలు తినండి." అంది జగదాంబ కోపంగా.

కష్టం మీద ఏదో తిన్నాననిపించాడు భీమశంకరం. ప్లేట్లో చెయ్యి కడుక్కుని, సునందవల్లి వేపు చూస్తూ అడిగేడు. "అయితే నువ్వసలు స్టూడియోలోకే వెళ్ళలేదంటావు. అక్కడేం జరిగిందో తెలీదంటావు... అవునా?'

అంతే మరి! అన్నట్టుగా తలూపింది సునందవల్లి.

"లోపలికి వెళ్ళక, మరెక్కడికి అఘోరించావే? నిన్నసలు ఆవిడ వెంట పంపించింది దేనికని...?" కోపంగా అరుస్తూ అంది జగదాంబ. సునందవల్లి మాట్లాడలేదు. ఆ పిల్ల తీరు జగదాంబకీ, భీమశంకరానికీ కోపం తెప్పిస్తోంది.

"అసలా రోజు ఏం జరిగిందే?" జగదాంబ బతిమాలే ధోరణిలో అడిగింది.

సునందవల్లి మాట్లాడక పోవడంతో, "ఏం జరిగిందంటే మాట్లాడవేం." పరుషంగా అడిగేడు భీమశంకరం. తల్లీ తండ్రీ తననలా నిలదీయడం మరి సహించ లేక పోయింది సునందవల్లి. "ఏం జరిగిందా? ఆ రోజు భూమి బద్దలైంది. ఆకాశం కూలి నెత్తి మీద పడింది... సరేనా!" అంటూ విస విసా తన గదిలోకి వెళ్ళి పోయింది. కూతురు ఇలా ఆకుకీ పోకకీ అందకుండా తిక్కగా జవాబిచ్చే సరికి, ఆ దంపతులు చేష్టలు దక్కి ఉండిపోయేరు. కాస్సేపు ఇద్దరిలో ఎవరూ మాట్లాడ లేదు. మరి కాస్సేపటికి భీమశంకరం నోరు పెగుల్చుకుని అన్నాడు. "అమ్మ పట్ల నీ ధోరణి కాస్త సజావుగా ఉంటే, ఇవాళ మనకీ టెన్షన్ ఉండేది కాదు కదా..."

అంతే!

అలా అనీసేడే కానీ, అసలు తను అలా అనగలగడం తనకే ఆశ్చర్యంగా ఉంది భీమశంకరానికి. ఆ మాటలతో, ఆ యింట్లో ఓ పెద్ద తుఫాను మొదలైంది. జగదాంబ ఇల్లూ వాకిలీ ఎగిరి పోయేలా కేకలెయ్యడం ప్రారంభించింది. అత్తగారినీ, భర్తనీ ముందు ఏడు తరాల వారినీ తిడుతూ, ఏడుపులూ, పెడ బొబ్బలూ పెట్టసాగింది.

మధ్య మధ్యలో భీమశంకరం కూడా కలగజేసుకుని, ఓ మాట విసురుతూ ఉండడంతో ఆ గొడవ మరింత పెద్దదయింది. సునందవల్లి తన గది లోనుంచి వాళ్ళ కేకలు, నాదనలూ వింటూ నవ్వుకుంది.

* * *

ఈ గొడవకంతటికీ మూల కారణం – ఆ ఇంట్లో దాదాపు నాలుగు నెలల కిందట జరిగిన ఓ సంఘటన.

ఆ రోజు భీమశంకరం ఆఫీస్ కొలీగ్ రామ్మూర్తి వచ్చి, ఓ విషయం చెప్పేడు. ఆంధ్ర దేశంలో ప్రఖ్యాతి పొందిన ఓ టీ వీ ఛానెల్ వాళ్ళు, వారం వారం నిర్వహించే 'మీతో మేము' కార్యక్రమంలో ఈ సారి కేవలం వృద్ధులతో ఓ కార్యక్రమం నిర్వహించ బోతున్నారుట. వృద్ధుల మనో భావాలూ, వారి సమస్యలూ అందులో చర్చకు వస్తాయిట. ఆ టీవీ వాళ్ళు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ ఉంది. సంఘంలో ఉండే రకరకాల వ్యక్తుల అభిప్రాయాలు నిష్కర్షగా అందులో వెల్లడి అవుతూ ఉంటాయి. కేవలం వృద్ధులతో తీసే ఆ కార్యక్రమం రెండు ఎపిసోడ్స్‌లో ఉంటుందనీ భీమశంకరం అంగీకరిస్తే అతని తల్లి అన్నపూర్ణమ్మ గారు అందులో పాల్గొనేలా చేయించ గలననీ చెప్పాడు రామ్మూర్తి. భీమశంకరం మరో ఆలోచన లేకుండా అందుకు అంగీకరించేడు. అ ఏర్పాట్లేవో చూడమన్నాడు. తల్లితో ఆ విషయం చెప్తే, 'నాకెందుకు నాన్నా అలాంటివన్నీ' అంది కానీ గట్టిగా వారించ లేక పోయింది. కొడుకూ కోడలూ చెప్పేదాన్ని కాదనగలిగే స్వాతంత్ర్యం ఆవిడా ఇంట్లో ఎప్పుడో పోగొట్టుకుంది. ఆ తరువాత రామ్మూర్తి చక చకా పని చేసాడు. అన్నపూర్ణమ్మకి కూడా తక్కిన వృద్ధులతో పాటు ఆ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చింది.

జగదాంబ కిదేం నచ్చ లేదు. ఎంతో ప్రాచుర్యం ఉన్న టీ వీ ఛానెల్లో... బుల్లి తెర మీద అత్త గారు కనిపించడం – అంతే కాక కాస్సేపు ఏదో మాట్లాడే అవకాశం లభించడం

ఆమె సహించ లేక పోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండా ఇందుకు అంగీకరించినందుకు భర్త మీద విరుచుకు పడింది. "ముసిలాడికి దసరా పండుగని, చాలా బాగుంది సంబడం... మరింకేం... ఏ బ్యూటీ పార్లర్‌కో తీసుకెళ్ళి, మీ అమ్మ గారికి షోకులూ, మేకప్పూ చేయించి మరీ స్టూడియోకి తీసి కెళ్ళండి... అఖిలాంధ్ర ప్రేక్షకులూ ఆవిడ అందచందాలని చూసి తరిస్తారు... సిగ్గు లేక పోతే సరి..." అంది వెటకారంగానూ, ఉక్రోషంగానూ. భీమశంకరానికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. భార్యని సమాధాన పర్చడం కోసం తన చర్యని సమర్థించుకోడానికి పాయింట్లు వెతుక్కుంటున్నాడు. "అలా యిదైపోతావెందుకే... దీని వలన మనకి చెడి పోయేదేమీ లేదు... పైపెచ్చు... అమ్మ టీ వీలో ఫలాని కార్యక్రమంలో కనిపించే ఏర్పాట్లు చేసామనీ, చూడవలసిందనీ బంధువులందరికీ ఉత్తరాలు రాద్దాం. దీంతో అమ్మని మనం ఎంత అపురూపంగా చూసుకుంటున్నామో అందరకీ తెలుస్తుంది. బంధువుల్లోనూ, ఆఫీసులో స్నేహితుల్లోనూ మనకి కొద్దో గొప్పో మంచి పేరే వస్తుంది..." అని తన ఆలోచన బయట పెట్టాడు భీమశంకరం. తల్లిపట్ల బాధ్యత వహించాల్సిన కొడుకుగా... తన ఆలోచనలోని వికృతత్వం, అసహజత్వం అతనికి ఆ సమయంలో స్ఫురించనే లేదు.

జగదాంబ అయిష్టంగానే తలూపింది. తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే అన్నపూర్ణమ్మ గారు ఆ టీ వీ కార్యక్రమంలో పాల్గొనడం ఖరారయి పోయింది. సునందవల్లి నాయనమ్మని స్టూడియోకి తీసుకెళ్ళడానికి నిశ్చయమైపోయింది. తల్లినీ కూతుర్నీ టీ వీ స్టూడియోకి ఆటోలో పంపించి, తల్లి పాల్గొనే కార్యక్రమం త్వరలో రాబోతోందనీ, వివరాలు తర్వాత తెలియ జేస్తాననీ బంధువర్గానికీ, స్నేహితులకీ సగర్వంగా ఉత్తరాలు రాసి పడేసాడు భీమశంకరం.

* * *

మరో రెండు నెలల తర్వాత టీ వీలో 'మీతో మేము' కార్యక్రమం ప్రసారమవుతూ ఉంటే, టీ వీ ముందు కూర్చున్నారు జగదాంబ, భీమశంకరం. ఆ కార్యక్రమం అంతా వృద్ధులతోనే వుంటుందని అప్పటికే టీ వీ ప్రకటనల ద్వారా విస్తృతంగా ప్రచారం జరిగింది. బంధువుల నుంచీ, స్నేహితుల నుంచీ తనకందబోయే అభినందనలని తలుచుకుంటూ టీవీ చూస్తున్నాడు భీమశంకరం. జగదాంబ నోటికి జడిసి, తల్లికి పాతకాలపు పౌరాణిక సినిమా కూడా చూపించి ఎరుగడు తను. తనూ, భార్యా తల్లిని సరిగా చూసుకోవడం లేదని బంధువుల్లో కొందరికి అప్పుడే అనుమానం పాతుకుని ఉంది. ఒకరిద్దరు నర్మగర్భంగా మాటలు దొర్లించేరు కూడా. 'ఈ టీ వీ కార్యక్రమంతో వాళ్ళ నోళ్ళు దెబ్బకు మూతబడతాయి,' అనుకుంటూ టీ వీ చూస్తున్నాడు భీమశంకరం.

దాదాపు పాతిక మంది వృద్ధ మహిళలూ, పురుషులూ కనిపిస్తున్నారు తెర మీద. ప్రశ్నలూ, జవాబులూ – రసవత్తరంగా సాగుతోంది కార్యక్రమం. ఓ లిప్త సేపు తప్ప తల్లి ఎక్కువ కనిపించ లేదు. తల్లికి ఈ ఎపిసోడ్‌లో మట్లాడే వీలు చిక్కేలా లేదు. మళ్ళీ వారం వరకూ ఆగాలి కాబోలు..

గంట ప్రోగ్రాం మధ్యలో ప్రకటనల కోసం కొద్దిపాటి విరామంతో కొనసాగింది. అందులో పాల్గొన్న వృద్ధులంతా ఎంతో ఉల్లాసంగా మాట్లాడుతున్నారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యక్తి ఓ సుప్రసిద్ధ సినిమా కారెక్టరు యాక్టరు. ప్రశ్నలు వేసి, జవాబులు రాబడుతున్నాడు. వృద్ధులంతా తమ బాల్యం గురించీ, పిల్లల చదువులూ, ఉద్యోగాల గురించీ సరదాగా మాట్లాడుతున్నారు.

అప్పుడు జరిగిందది!

భీమశంకరం కలలో కూడా ఊహించని విషయం...

ఓ వృద్ధురాలు, తనవంతు వచ్చి నప్పుడు – ఏడుస్తూ మాట్లాడటం ప్రారంభించింది. తనకి ముగ్గురు కొడుకులున్నారనీ, ఎవరూ తనని సరిగా చూసుకోవడం లేదనీ, తన ప్రస్తుత పరిస్థితి చెప్పుకోలేనంత దుర్భరంగా ఉందని... కనీసం వృద్ధుల ఆశ్రమంలో దేనిలో నయినా చేర్పించమని ప్రాధేయ పడుతున్నా కొడుకులూ, కోడళ్ళూ వినిపించు కోవడం లేదనీ – కన్నీరు మున్నీరుగా విలపిస్తూ మాట్లాడింది ఆమె. చిన్న తెర మీద ఆమె మాటలు వింటూ భీమశంకరం, జగదాంబ నీరుకారి పోయేరు. తల్లి టీ వీలో కనిపిస్తే అందరిలో తనకి గొప్పగా ఉంటుందని ఊహించాడే తప్ప, ఇలా కూడా జరిగే అవకాశం ఉందని భీమశంకరానికి ఇంత వరకూ తట్టనే లేదు! తల్లి కూడా ఇలాగే మాట్లాడితే తమ పరువేం కావాలి! అందరిలో తలెత్తుకుని తిరగ్గలడా? ఈ అలోచన వచ్చేక, సిగ్గుతో భయంతో కంపించి పోయేడతను. ఆ రోజునుంచీ ఆ దంపతులకి సరైన నిద్రాహారాలు లేవు. ఆ రోజు ఎపిసోడ్‌లో తల్లి మాట్లాడ లేదు. మళ్ళీ వారం ప్రసారమయే కార్యక్రమంలో తల్లికూడా ఇలాగే మాట్లాడితే! 'మీ నాన్నమ్మ టీ వీ షూటింగ్‌లో ఏం మాట్లాడిందే' అని ఎంత గుచ్చి గుచ్చి అడిగినా సునందవల్లి పెంకెగా సమాధానం చెప్పక పోవడంతో వాళ్ళ ఆందోళన రెట్టింపయింది.

తల్లినే నేరుగా అడిగేద్దామా అనిపించింది భీమశంకరానికి. కాని ఈవిడ రెండు నెలల క్రితమే తమ్ముడి దగ్గరకి వెళ్ళి పోయింది. ఓ ఆర్నెల్లు అక్కడా, ఆర్నెళ్ళు తనదగ్గరా అని అమ్మని వాటాలు వేసుకున్నారాయె! తన బంధువులూ, స్నేహితులూ అందరూ, రాబోయే వారం కూడా టీ వీలో తప్పని సరిగా ఆ కార్యక్రమం చూస్తారు..., ఆవిడ ఏం మాట్లాడిందో! తలచుకుంటేనే వెన్ను జలదరిస్తోంది భీమశంకరానికి. జగదాంబ ఓ వైపు తిట్టి పోస్తోందతన్ని. విపరీతమైన టెన్షన్‌తో, ఎలాగో ఆ వారం గడిచింది వారికి. తర్వాత వారం ఆ కార్యక్రమం ప్రసారమయే వేళకి చెప్పలేనంత భయాందోళనలతో టీ వీ ముందు చేరారు దంపతులిద్దరూ. టీ వీలో కార్యక్రమం మొదలయిందో లేదో – కరెంటు పోయింది! మళ్ళీ ఎప్పటికో కాని కరెంటు రాలేదు. ఈ లోగా ఆ కార్యక్రమం కాస్తా అయిపోయింది. భీమశంకరానికీ, జగదాంబకీ ఊపిరి స్తంభించి పోయినట్టయింది. వాళ్ళ ఆందోళనకీ, వ్యధకీ అంతు లేదు. సర్వ శక్తులూ ఉడిగి పోయినట్టుగా ఉండి పోయేరు. చాలా సేపటికి గాని తేరుకో లేదు.

ఆ తర్వాత మళ్ళీ ఇంట్లో ఘర్షణ మొదలైంది. కేకలు, పరస్పర నిందారోపణలు, అరచు కోవడాలతో ఇల్లు దద్దరిల్లి పోయింది. ఎంత బతిమాలినా, ఎన్ని విధాల అడిగినా,

సునందవల్లి నోరు విప్పడం లేదు. ఏమీ చెప్పకుండానే తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆ దంపతుల ముఖాల్లో కత్తి వేటుకి నెత్తురు చుక్క లేదు. గదిలో కూచున్న సునందవల్లికి తల్లిదండ్రుల ఘర్షణ చెవిని పడుతూనే ఉంది. తనలో తనే నవ్వుకుంది -

'ఇవాళో రేపో - ఏం జరిగిందో అమ్మకీ నాన్నకీ తెలీకుండా పోదు. కనీసం అంతవరకయినా వాళ్ళనా మనోవ్యధని అనుభవించనీ! నాయనమ్మ పట్ల రోజూ వాళ్ళు చూపే అనాదరణకి వాళ్ళకీపాటి శిక్ష సమంజసమే!' కసిగా అనుకుంది.

ఆ రోజు - రెండో రోజు టీవీ స్టూడియోకి బయలు దేరిన నాయనమ్మ తనతో అన్న మాటలు గుర్తొచ్చేయి సునందవల్లికి. "ఆ టీ వీ వాళ్ళ దగ్గరకి మరింక వెళ్ళొద్దే సునందా!... వాళ్ళేదో అడుగుతారు... నిజం చెప్పడానికి ధైర్యం చాలదు. అబద్ధమాడాలంటే నోరు రాదు. మనం అక్కడికి వెళ్ళలేదన్న సంగతి మీ అమ్మా నాన్నలకి చెప్పొద్దు... తర్వాత ఎలాగో ఒక లాగ తెలిస్తే తెలియనీ. మీ నాన్న ఫ్రెండు రామ్మూర్తి లేదూ - అతన్ని కూడా నాల్రోజులపాటు ఈ విషయాన్ని దాచిపెట్టమని నువ్వే బతిమాలు - ఏం?" అంది నాయనమ్మ.

ఆ రోజు ఆ మనవరాలూ, నాయనమ్మా అసలు టీ వీ స్టూడియోకే వెళ్ళలేదనీ, చాలా సేపటి వరకూ బిర్లా మందిరంలోనే గడిపి వచ్చేరనీ - జగదాంబకీ, భీమశంకరానికీ ఇప్పట్లో తెలిసే అవకాశం లేదు!

* * *

*ఆంధ్ర జ్యోతి, తెలుగు కళా సమితి ( న్యూజెర్సీ ) రాజా లక్ష్మీ ఫౌండేషన్ వారి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ. ఆంధ్రజ్యోతి వార పత్రిక 17 -10 - 1997 సంచికలో ప్రచురణ.*